ఈనాడు
ములుగు
సోమవారం సెప్టెంబరు 30, 2024

విహారం.. విన్యాసం..!

గోవిందరావుపేట మండలం లక్నవరం జలాశయానికి వారాంతపు సెలవు దినమైన ఆదివారం రోజున పర్యాటకులు విశేషంగా తరలివచ్చారు. జలాశయం పరిసర ప్రాంతాల్లో సందడి చేశారు. ప్రకృతి అందాలకు పరవశించిపోయారు. జలాశయంలో బోటు షికారు చేసి తన్మయులయ్యారు. మరోవైపు జలాశయం వద్ద పర్యాటకులు కొందరు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. వేలాడే వారధులపై ఫొటోల కోసం ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వీరి చర్యలు పర్యాటకులకు ఇబ్బందిగా మారుతున్నాయి. మొదటి వేలాడే వారధిపై ఓ యువకుడు నిబంధనలకు విరుద్ధంగా పిల్లర్ బీం పైకి ఎక్కి ఫొటోలు దిగుతున్నాడు. ఏదైనా అనుకోని ఘటన జరిగితే ఎంత ప్రమాదం జరుగుతుందో గుర్తించడం లేదు. ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన యంత్రాంగం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. జలాశయం వద్ద భద్రతా లేమికి ఇది అద్దం పడుతోంది. సందర్శకులు ఇలాంటి విన్యాసాలకు పాల్పడకుండా చూడాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, లక్నవరం జలాశయం, (గోవిందరావుపేట),

మత్తులో 'ముంచుతా'.. జీవితాలు కూల్చుతా!



నేను గంజాయిని.. సమాజాన్ని పీడిస్తున్న మహమ్మారిని.. ఒకప్పుడు పెద్ద నగరాల్లో.. పట్టణాల్లో నా ఉనికి ఉండేది.. ఇప్పుడు పల్లెలకూ పాకాను.. పిల్లలు, యువకులే కాదు.. అమ్మాయిలూ నాకు దాసోహం అవుతున్నారు. ఇదే అదనుగా వారిని బానిసలుగా మార్చేస్తున్నాను. నా 'మత్తు'లో ముంచి.. విలువైన జీవితాలను చిత్తు చేస్తున్నాను.. అనారోగ్యం బారినపడి.. జైలుపాలైన వారి సంబంధీకులు నిత్యం క్షోభ అనుభవిస్తున్నారు. ఇంతకూ నాలో ఏం ఉంటుందని అనుకుంటున్నారా..? మత్తును కలిగించే టెట్రా హైడ్రోకన్నాబినాల్ (టీహెచ్‌సీ) అనే రసాయన ప్రభావమే కారణం.. మైకంలో ముంచి.. విచక్షణ కోల్పోయేలా చేస్తాను.

నాకెన్నో రూపాలు : అక్రమార్కులు నన్ను అంగట్లో పెట్టి జేబులు నింపుకొంటున్నారు.. ఎండిన ఆకు రూపంలో విక్రయిస్తే పట్టుబడతామని నాకు యాష్ ఆయిల్, చాక్లెట్ల రూపాన్ని తీసుకొచ్చారు. నాకు భిన్నరూపాలు, మార్గాలు ఉండటంతో పోలీసులూ ఏం చేయలేకపోతున్నారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు నుంచి భద్రాచలం మీదుగా ఉమ్మడి వరంగల్‌లో ప్రవేశిస్తున్నా.. మరి నన్ను తరిమికొడతారా..? దాసోహం అవుతారా..? అనేది మీ చేతుల్లోనే ఉంది.

గంజాయి మహమ్మారి దురాగతమిది..

ఈనాడు, మహబూబాబాద్ –న్యూస్‌టుడే, వరంగల్ క్రైం, కాటారం (భూపాలపల్లి జిల్లా)

ఇలాంటి దారుణాలెన్నో..!

- భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో ఇద్దరు యువకులు గంజాయికి బానిసై నేరాలు చేసేందుకు అలవాటుపడ్డారు. మత్తులో పలువురిపై దాడి చేయడంతో జైలు పాలయ్యారు. కుటుంబ సభ్యులు కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోయారు.
- ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు గంజాయికి బానిసై మానసిక పరిస్థితి బాగోలేక పిచ్చిగా ప్రవర్తించేవాడు. కుటుంబ సభ్యులు మానసిక వైద్య నిపుణుడి వద్ద చికిత్స అందించారు. రూ.వేలల్లో ఖర్చయింది.
- భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని పేద కుటుంబానికి చెందిన కుమారుడు ఎదిగి ఆసరాగా ఉంటాడనుకుంటే గంజాయికి బానిసై.. రవాణా చేస్తుండగా.. ఇటీవల పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు. కుటుంబం మానసిక క్షోభ అనుభవిస్తోంది.

గంజాయి మానవ శరీరంలోని వివిధ అవయవాలపై ప్రభావం చూపుతుందని భూపాలపల్లి వైద్య కళాశాల సూపరింటెండెంట్, ప్రొఫెసర్ డాక్టర్ కోడూరు నవీన్‌కుమార్ వివరించారు..

ప్రభావం ఇలా..

- **మెదడు :** తరచూ ఎక్కువ మోతాదులో తీసుకుంటే నాడీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. తెలియని ఆతృత, భయం కలిగి ఉంటారు. ఇంద్రియాలు ఆధీనంలో ఉండవు.
- **దృష్టిలోపం :** అతిగా తీసుకోవడంతో కళ్లు ఎర్రగా కనిపిస్తాయి. దృష్టి లోపానికి గురయ్యే ప్రమాదం ఉంది.
- **గుండె :** హృదయ స్పందన రేటు, రక్త పోటు పెరుగుతుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువ.
- **ఊపిరితిత్తులు :** ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. శ్వాసకోశ సమస్యలు ఎదురవుతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుంది.

2024(ఇప్పటివరకు)లో పట్టుకున్న గంజాయి వివరాలు

వరంగల్ కమిషనరేట్	850.000	2,75,00,000	101
మహబూబాబాద్	485.198	1,21,43,325	20
భూపాలపల్లి	25.000	6,25,000	25
ములుగు	38.473	9,58,317	11

● పోలీస్ విభాగం ● పట్టుకున్న గంజాయి(కిలోల్లో)
● విలువ(రూ.లక్షల్లో) ● నమోదుచేసిన కేసులు

క్వింటాళ్లలో రాక..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు 2023లో రూ.4.14 కోట్ల విలువచేసే 20 క్వింటాళ్ల గంజాయి పట్టుకొని 103 కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి రూ.4.12 కోట్ల విలువైన 13 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకొని 157 కేసులు నమోదు చేశారు. అత్యధికంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలోనే పట్టుబడింది.

నిరంతరం నిఘా..

- అంబర్ కిశోర్ ఝా, సీపీ, వరంగల్

గంజాయి రవాణా, సేవించడంపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంది. టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులతో ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. నిందితులకు శిక్షలు పడేలా సాక్ష్యాలను సేకరిస్తున్నాం. పదేపదే గంజాయి రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్టులను నమోదు చేస్తున్నాం.

విద్యుత్తు శాఖలో బదిలీల సందడి

ములుగు, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో బదిలీల సందడి మొదలైంది. ఈ మేరకు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తర్వుల్లో బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలను పొందుపర్చారు. ఉత్తర్వులను పురస్కరించుకొని ఆయా జిల్లాల్లోని విద్యుత్తు డివిజనల్ ఇంజినీర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్ల పర్యవేక్షణలో బదిలీల ప్రక్రియకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. బదిలీలకు అర్హులైన వారి జాబితాను విద్యుత్తు డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలిపేందుకు సెప్టెంబరు 30 వరకు అవకాశం ఇచ్చారు. బదిలీ కోరుకునే వారు అక్టోబరు 10 వరకు బదిలీ కోసం వారు కోరుకునే స్థానానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్టోబరు 7 వ తేదీ వరకు బదిలీ అయిన వారికి బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారు అక్టోబరు 9వ తేదీ లోపు ప్రస్తుత స్థానం నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుంది. రిలీవ్ కావడానికి ముందు వారి ఆధీనంలో ఉన్న బాధ్యతలను పూర్తి చేయాల్సి ఉంటుంది. బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత అక్టోబరు 8 నుంచి బదిలీలపై నిషేధం అమలులోకి వస్తుంది. బదిలీల నిషేధం కొనసాగుతున్న సమయంలో ఎవరినైనా బదిలీ చేయాలనుకుంటే ప్రత్యేక పరిస్థితులను బట్టి బదిలీ చేయనున్నారు.

వరంగల్ రిజిస్ట్రారుగా ఫణిదర్

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రార్‌గా ఫణిదర్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగాయనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొందరిని మళ్లీ బదిలీ చేసింది. హైదరాబాదు ఐజీ కార్యాలయం ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న ఫణిధర్ వరంగల్‌కు రానున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన ఈయన 1988 గ్రూపు-2 అధికారిగా ఉద్యోగంలో చేరారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాదు జిల్లాల రిజిస్ట్రారుగా చేసిన అనుభవం ఉంది. సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రారు సుభాషిణి నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు
శ్రీమతి & శ్రీ వడ్లూరి గంగరాజు-లక్ష్మి గార్లు
AAE, TRE-TGNPDCL, Hanamkonda
గత 34 సం||లుగా విద్యుత్ శాఖలో వివిధ హోదాలలో ఎనలేని సేవలందించి అందరి మన్ననలు పొంది నేడు పదవీ విరమణ చేయుచున్న మా నాన్న శ్రీ వడ్లూరి గంగరాజు గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు..
వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని మనసారా కోరుకుంటూ..
కొడుకు - కోడలు
వడ్లూరి అనిల్ కుమార్-షర్మిల
మనవలు
"ధృవాన్ష్, రోహన్ష్
కొడుకు - కోడలు
వడ్లూరి సునీల్ కుమార్-అరుంధతి
కూతురు
వడ్లూరి అనూష

కార్యాలయ వేళల్లో అదనంగా సెమీ డీలక్స్ బస్సులు

ములుగు, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని కార్యాలయ వేళల్లో ఉదయం, సాయంత్రం హనుమకొండ నుంచి ములుగు మీదుగా ఏటూరునాగారం వరకు మినీ సెమీ డీలక్స్ బస్సులు నడపనున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లా ప్రయాణికులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు ఉదయం 7.30, 7.45 గంటలకు, మధ్యాహ్నం 1.20, 2.15 గంటలకు, ఏటూరునాగారం నుంచి హనుమకొండకు ఉదయం 10.10, 11.30 గంటలకు, సాయంత్రం 4, 5, గంటలకు, ములుగు నుంచి హనుమకొండకు ఉదయం 11.35, 12.55 గంటలకు, సాయంత్రం 5.25, 6.25 గంటలకు బస్సులు నడపనున్నట్లు వివరించారు.

క్రీడా మైదానం.. ఇసుక లారీలమయం

క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్థానిక క్రీడా మైదానం ఇసుక లారీల అడ్డాగా మారిపోయింది. ఇటీవల కాలంలో నిర్మాణరంగం పనులు ఊపందుకోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇసుకకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో రాష్ట్రంలోని ఎక్కువ ఇసుక లారీలు ఏటూరునాగారం ప్రాంతానికి రావడం మొదలైంది. దీంతో మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వెంకటాపురం మండలాల్లోని ఇసుక క్వారీలు ఉన్న గ్రామాలు, రహదారులపై లారీలు నిండిపోతున్నాయి. – న్యూస్‌టుడే, తాడ్వాయి

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం

బురదమయంగా వంతెన అప్రోచ్ మార్గం

పది రోజుల క్రితం పొలం పనులకు వెళ్లి వస్తున్న ఓ ట్రాక్టరు దిగబడింది. దానిని బయటకు తీసేందుకు కర్షకులు నాలుగు ట్రాక్టర్లు తెప్పించి రోజంతా శ్రమించారు.

వాజేడు, న్యూస్‌టుడే: సకాలంలో పనులు చేపట్టకపోవడంతో.. రవాణా కష్టాలు తప్పడం లేదు. అధికారుల అలసత్వం, గుత్తేదారు ఇష్టారాజ్యం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. రహదారి దుస్థితిపై స్పందించని ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరకిలోమీటరు దూరంలోని పంటపొలానికి వెళ్లాలంటే ఎనిమిది కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలు వెళ్లలేని దుస్థితి

వాజేడు మండల కేంద్రానికి సమీపంలోని కొంగాలవాగుపై వంతెన అప్రోచ్ మార్గం పనులను పూర్తిచేయడంలో గుత్తేదారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అప్రోచ్ దారిలో కంకర పరిచి రోడ్డు పనులు పూర్తి చేపట్టాల్సి ఉండగా, మట్టి పోసి వదిలేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి మొత్తం బురదమయంగా మారి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ద్విచక్రవాహనాలతో పాటు ఆటోలు, నాలుగు చక్రాల బండ్లు ఈ దారిలోని బురదలో కూరుకుపోతున్నాయి.

ఇటీవల జరిగిన సంఘటనలు..

- ఆగస్టు ఒకటిన పొలం పనులకు వెళ్లి వస్తున్న ఓ ట్రాక్టరు దిగబడగా, దానిని బయటకు తీసేందుకు రైతులు నాలుగు ట్రాక్టర్లతో రోజంతా శ్రమించాల్సి వచ్చింది.
- 30 మంది ప్రయాణికులతో పేరూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆగస్టు 30వ తేదీ రాత్రి బురదలో కూరుకుపోయింది. చిమ్మచీకటిలో చంటిపిల్లలతో మహిళలు అవస్థలకు గురయ్యారు. ఈ దారి గుండా ఆర్టీసీ బస్సులను నడిపేందుకు యాజమాన్యం నిరాకరించింది.
- పదిహేను రోజుల క్రితం చీకుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అస్తవ్యస్తంగా మారిన దారిలో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురయ్యాడు.
- నాలుగు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకు ద్విచక్రవాహనాలు జారిపడిపోతున్నాయి. ఇటీవల మండలంలో పర్యటించిన భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావుకు రహదారి దుస్థితిని స్థానికులు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి వెంటనే పనులు పూర్తిచేయాలని ఆదేశించినా.. నేటివరకు ఎటువంటి పురోగతి లేదు.

మన హన్మకొండ, మహబూబాబాద్ & పరకాల్ లో
DUSSEHRA MAHOTSAVA
సద్దుల బతుకమ్మ మరియు దసరా ఆఫర్స్
ప్రతి ₹500 కొనుగోలు పై లక్కీ డ్రా కూపన్ పొందండి
TVS Star city Ex showroom price ₹63,000/- only
ప్రతి ఊరిలో ఒక 'బైక్' 'బంపర్ డ్రా' లో గెలుచుకునే అవకాశం
FROM SEPTEMBER 23RD TO OCTOBER 11TH
కాసం ఫ్యాషన్స్ లో దసరా షాపింగ్ చెయ్యండి
గెలుచుకోండి అద్భుతమయిన TVS స్టార్ సిటీ బైక్ బహుమతిగా
*T&C APPLY
KASAM FASHIONS
WE ♥ FASHION & FASHION AT KASAM
SAREES | KIDS | WOMENS | MENS | GHAGRAS
SUITING & SHIRTING
HANNAMKONDA | PARKAL | SHADNAGAR | BHADRACHALAM | JAMMIKUNTA | SADASHIVPET
VIKARABAD | MAHABUBABAD | PALWANCHA | SHANKARPALLY | GADWAL | JAGGAIAPET

(c) eenadu

నల్ల సూరీలు.. కండల వీరులు!

ఓ వైపు దేశానికి వెలుగు అందించేందుకు రక్తాన్ని చెమటగా మార్చి.. బొగ్గు గనుల్లో పని చేస్తూనే.. మరోవైపు క్రీడలపై ఆసక్తితో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు ఈ నల్ల సూరీలు.. రాష్ట్ర స్థాయిలో ఇటీవల కొత్తగూడెంలో నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయిలో కోల్ ఇండియా పోటీలకు భూపాలపల్లి సింగరేణి డివిజన్ నుంచి ఎనిమిది మంది ఎంపికవడం విశేషం.. ఒడిశాలోని ఎంసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు పోటీలు నిర్వహించారు. ఇందులో రెండు బంగారు, మూడు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు, సింగరేణి క్రీడల సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్‌ను భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్, అధికార ప్రతినిధి కె.మారుతి అభినందించారు.

–న్యూస్‌టుడే, భూపాలపల్లి

కోల్ ఇండియా పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆరు పతకాలు

బంగారు పతకం సాధించా..

- సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, కేటీకే 6వ గని కోల్ కట్టర్

సింగరేణి సంస్థలో 2015లో ఉద్యోగంలో చేరాను.. ప్రస్తుతం భూపాలపల్లి డివిజన్‌లోని కేటీకే 6వ గనిలో కోల్‌కట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నా.. నిత్యం క్రికెట్ ఆడటం, వాకింగ్ చేయడం అలవాటు. ఈ క్రమంలోనే సింగరేణి జిమ్ కోచ్ సమ్మయ్య, క్రీడల సూపర్‌వైజర్ శ్రీనివాస్ సలహాలతో బాడీ బిల్డింగ్ క్రీడ ఎంచుకుని నిత్యం సాధన చేశాను. 2017లో మొదటిసారి కోల్ ఇండియా పోటీల్లో పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించాను. 2019లో మిస్టర్ సింగరేణి, 2022లో మిస్టర్ తెలంగాణ ప్రత్యేక అవార్డులు పొందాను. ఇటీవల ఒడిశాలో జరిగిన కోల్ ఇండియా పోటీల్లో బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించాను..

కంపెనీ స్థాయిలో ప్రథమం..

- శ్రీలేఖ్య, కేటీకే 5వ గని బదిలీ వర్కర్

కేటీకే 5వ గనిలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను.. ఈ ఏడాదిలోనే వారసత్వ ఉద్యోగంలో చేరాను. చిన్నవయసు నుంచే ఆటలంటే ఎంతో ఇష్టం. ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలో సింగరేణి ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం నిర్వహించిన ఉచిత శిక్షణకు హాజరయ్యాను. పరుగు పందెం పోటీల్లో పట్టు సాధించడమే కాకుండా పవర్ లిఫ్టింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకున్నా.. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన కంపెనీ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాను. జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 52 కిలోల విభాగంలో రజత పతకం సాధించాను..

సింగరేణి 'స్ట్రాంగ్ ఉమెన్'

- పి.శ్వేత, స్టాఫ్ నర్సు, భూపాలపల్లి ఏరియా ఆసుపత్రి

2022లో భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా చేరాను. మహిళా విభాగంలో సింగరేణిలో మొదటిసారి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తుండటంతో సాధన మొదలుపెట్టాను. 2022లో శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించిన పోటీల్లో 73 కిలోల విభాగంలో మొదటి స్థానంలో నిలిచాను. సింగరేణిలో 'స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ సాధించాను.. కోల్ ఇండియా జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో 69 కిలోల విభాగంలో రజత పతకం సాధించాను.

కోచ్‌గా క్రీడాకారులను తయారుచేస్తా..

- పుట్ట ప్రకాష్, రెస్క్యూ బ్రిగేడియర్, ఈపీ ఆపరేటర్

2016లో సింగరేణిలో ఉద్యోగంలో చేరాను.. ప్రస్తుతం రెస్క్యూ బ్రిగేడియర్, ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నా.. 2017లో నిర్వహించిన కోల్ ఇండియా పోటీల్లో బాడి బిల్డింగ్‌లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నా.. వరసగా 2019 నుంచి 2023 వరకు కోల్ ఇండియా పోటీల్లో పాల్గొంటూ రజత పతకాలు సాధించాను. ఈ సారి పోటీల్లో పతకం చేజారింది.. భవిష్యత్తులో అధికారులు సహకరిస్తే కోచ్‌గా విధులు నిర్వహిస్తా.

పట్టుదలతో రజత పతకం...

- మీర్జా యాసిన్ బేగ్, కేటీకే 1వ గని అండర్ మేనేజర్

2016లో సింగరేణిలో ఉద్యోగంలో చేరాను. కేటీకే 1వ గనిలో సీనియర్ అండర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. మొదటి నుంచి క్రీడలంటే ఇష్టం. పవర్ లిఫ్టింగ్ ఎంచుకుని నిత్యం జిమ్‌కు వెళ్లి సాధన చేస్తున్నాను. రెండేళ్లుగా కంపెనీ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నా.. 2023లో ఇదే పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాను. మరింత పట్టుదలతో సాధన చేస్తూ, 120 ప్లేస్ కేటగిరీలో పాల్గొని కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యాను. రజత పతకం సాధించాను.

13 ఏళ్లుగా రాణిస్తూ..

- బానోతు రమేష్, కేటీకే 6వ గని ట్రామర్

బెల్లంపల్లి డివిజన్‌లో 2006లో సింగరేణిలో ఉద్యోగంలో చేరాను. 2008లో భూపాలపల్లి డివిజన్‌కు బదిలీపై వచ్చాను. ప్రస్తుతం కేటీకే 6వ గనిలో ట్రామర్‌గా విధులు నిర్వహిస్తున్నా.. 2011 నుంచి 2016 వరకు నిర్వహించిన కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నా.. ఈ క్రమంలోనే 2016లో 800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో రజత పతకం సాధించా.. 2019లోనూ వెయిట్ లిఫ్టింగ్‌లో పాల్గొని మరోసారి రజత పతకం కైవసం చేసుకున్నా.. ఈ సారి కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యాను.

పండగ వేళ

పారాహుషార్!

● గతేడాది వరంగల్‌కు చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు వాట్సప్ ద్వారా వచ్చిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. తెరిచి చూడగా తక్కువ ధరకు ద్విచక్ర వాహనం విక్రయిస్తామని చెప్పి వాహన చిత్రాన్ని పెట్టాడు. మార్కెట్ దీని ధర రూ.75 వేలు ఉంటుంది. డబ్బులు అవసరం ఉందని కేవలం రూ.25 వేలకు ఇస్తానని చెప్పాడు. దీంతో ఉద్యోగి ఆన్‌లైన్ ద్వారా రూ.25 వేలు పంపించాడు. రెండురోజుల తర్వాత అడిగితే మరో రూ.10 వేలు పంపించాలని కోరాడు. అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తర్వాత చరవాణి స్విచ్ ఆఫ్ చేశాడు.

● హనుమకొండ జిల్లాకు చెందిన ప్రైవేటు ఉద్యోగినికి అలంకరణ వస్తువులు తక్కువ ధరకు ఇస్తామని చెప్పి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సందేశం పంపించారు. తక్కువ ధరకు వస్తున్నాయని రూ.10 వేల విలువైనవి ఆర్డర్ చేశారు. తర్వాత చరవాణికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. కొద్దిరోజుల తర్వాత పార్సిల్ వచ్చింది. తెరిచి చూడగా నాసిరకమైన వస్తువులు ఉన్నాయి.

న్యూస్‌టుడే, వరంగల్‌క్రైం(వర్ధన్నపేట)

● ఆఫర్ల విషయంలో అప్రమత్తత అవసరం

బతుకమ్మ, దసరా పండగల వేళ సైబర్ నేరగాళ్లు ఆఫర్ల ఎర వేసే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాల్లో తక్కువ ధరకే చరవాణులు, దుస్తులు, చేతి గడియారాలు అంటూ ఆకట్టుకునేలా ప్రకటనలు ఇస్తారు. ఆశపడి.. లింక్ క్లిక్ చేస్తే అంతే సంగతులు. ఇదంతా మోసం అని తెలుసుకునే లోపు ఖాతాలోని నగదు మాయమవుతుంది.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

అత్యాశకు పోతే అంతే సంగతులు..

ప్రముఖ కంపెనీలకు చెందిన లోగోలను అచ్చం వాటి మాదిరిగానే తయారు చేసి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ లాంటి సామాజిక మాధ్యమాల్లో లింక్‌లు పంపిస్తున్నారు. వాటి గురించి తెలియకుండానే అనేక మంది వాటిని ఇతరులకు పంపిస్తుంటారు. మార్కెట్ ధర కంటే 50శాతం నుంచి 75శాతం వరకు తగ్గింపు ధరలకు ఇస్తామంటూ.. వల వేస్తారు.

● ఉదాహరణకు ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా.. అకస్మాత్తుగా ఒక ప్రకటన కనిపిస్తుంది. అందులో రూ.1500కే ఐఫోన్ అంటూ.. కింద టైం నడుస్తూ ఉంటోంది. మరికొద్ది సేపట్లో ఈ ఆఫర్ ముగుస్తుందని రాసి ఉండటంతో.. మనం ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇంతలో లింకు తెరిచి.. యూపీఐ లేదా బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేస్తే. . అంతే సంగతులు. మనం తేరుకునేలోపే ఖాతా ఖాళీ అవుతుంది.

ఇలా చేస్తే సురక్షితం..

ఆన్‌లైన్‌లో వివిధ కంపెనీలకు చెందిన వస్తువులను కొనుగోలు చేయాలనుకుంటే గూగుల్ ప్లేస్టోర్, ఆపిల్ ఆఫ్ స్టోర్స్ నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కంపెనీలకు చెందిన అసలైన యాప్‌లు ఉంటాయి.

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాల వివరాలు (జనవరి 1 నుంచి సెప్టెంబరు 15 వరకు)

నమోదైన కేసులు 134

పోయిన డబ్బులు 7.85 కోట్లు

రికవరీ చేసిన నగదు రూ. 95.25 లక్షలు

ధర తక్కువంటే ఆలోచించాల్సిందే..

సైబర్ మోసగాళ్లు భారీ డిస్కౌంట్స్ ఇస్తామని చెప్పి యాప్‌ల ద్వారా ప్రచారం చేస్తారు. మార్కెట్‌లో ఐఫోన్- 16 ధర రూ. 1 లక్షకు పైగా ఉంటే దానిపై 75శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని ప్రకటనలు ఇస్తారు. ఓ యాప్‌తో పాటు ఫోన్ చిత్రాన్ని అందుబాటులో ఉంచి డబ్బులు పంపించాలని సూచిస్తారు. తక్కువ ధరకు వస్తుందని యాప్ తెరిచి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తే మోసపోవడం ఖాయం.

1930కి ఫిర్యాదు చేయాలి..

- సైబర్ విభాగం ఏసీపీ కె.విజయ్‌కుమార్

మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు ఆన్‌లైన్‌లో వస్తువులు ఇస్తామంటే వాటిని ప్రజలు నమ్మొద్దు. సామాజిక మాధ్యమాల్లో లింక్‌ల ద్వారా వచ్చే యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేసుకోవద్దు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలి.

'ఎమ్మెల్యే మాటలు వక్రీకరించడం సరికాదు'

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎమ్మార్పీఎస్, ఏ, బీ, సీ, డీ వర్గీకరణ విషయంలో మాట్లాడిన మాటలను వక్రీకరించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

EENADU Classifieds

BIRTHDAY GREETINGS

3వ జన్మదిన శుభాకాంక్షలు

చి॥ శిశిర హిమాన్వి

నేడు మూడవ పుట్టినరోజు జరుపుకుంటున్న మా ముద్దుల మనుమరాలు చి॥ శిశిర హిమాన్వికి జన్మదిన శుభాకాంక్షలు..

తాత: దొగ్గల లింగమూర్తి
అమ్మమ్మ: దొగ్గల పద్మజ
పెద్దపిన్ని: దొగ్గల మధులిక
చిన్నపిన్ని: దొగ్గల ప్రవళిక

BUSINESS SERVICES

BUSINESS OFFER

నాటుకోళ్ల పెంపకంలో మంచి అనుభవముండి శాస్త్రీయ పద్ధతిలో పెంచుతున్న నాటుకోళ్ల వ్యాపారం పట్ల ఆసక్తి కలవారు సంప్రః ✆ 7993945852.

SAREES

మావద్ద కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

BEAUTY & PERSONAL CARE

BEAUTY PARLOUR

Maa mirrors salon Basic Beauty course only- 5000 Certification available. Address: Subedari, HNK. ✆ 9154400576, 6309415548.

WANTED

పార్లర్‌లో పనిచేయుటకు బ్యూటీషన్స్ కావలెను. & బోటిక్ నందు పనిచేయుటకు కటింగ్ మాస్టర్ కావలెను. సంప్రదించుట 9182900152, 9963886324.

EDUCATION

Software ట్రైనింగ్- కెరీర్ గైడెన్స్+ లైవ్ ప్రాజెక్ట్+ Internship ఈ నాలుగు కలిపి ఆఫర్ చేస్తుంది, మన Lifeboat Technologies. Python, ఆండ్రాయిడ్, iOS, వెబ్ ఇలా ఏదైనా మన Hanamkonda లో. Call +91 9182259795.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

శ్రీ సమ్మక్క సారక్క జ్యోతిష్యాలయం గురూజీ సంజీవరాజు. భార్యాభర్తల సమస్య, ప్రేమ, పెళ్లి, ఉద్యోగం, వ్యాపారం, రియల్‌ఎస్టేట్, విదేశీయానం, కొత్త బస్టాండ్ హన్మకొండ. Ph: 9640454540

REAL ESTATE

PLOT FOR SALE

భీమారం to చింతగట్టు Main Road Facing 333 గజాల ప్లాట్ అమ్మబడును. వివరాలకు సంప్రదించండి: సెల్: 9700721870.

JOBS

వరంగల్, ఆటోనగర్ అమరాన్ బ్యాటరీస్/ స్పేర్స్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్ కావలెను. సంప్రః 9393442215, 26

ఆత్మకూర్ మండలం గుడెప్పాడ సర్వీస్ ప్రక్కన GK Mess (మన పురి వంటలు)లో పనిచేయుటకు అనుభవం గల వంట మనుషులు (భార్యభర్తలకు ప్రాముఖ్యత) వెంటనే కావలెను. (అన్ని రకాల వంటలు టిఫిన్‌తో). cell: 9989149799.

ప్రముఖ ఆడిట్ కంపెనీలో పనిచేయుటకు లేడి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ & ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన వేతనం ఇవ్వబడును. ✆ 8790207439.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

ఉస్మానియా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీః 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రుణయాప్‌ల వేధింపులతో యువకుడి ఆత్మహత్య

అనిల్ (పాత చిత్రం)

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: రుణం చెల్లించాలంటూ యాప్‌ల నిర్వాహకుల వేధింపులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకొంది. ఎస్ఐ సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామానికి చెందిన మాడుగుల అనిల్(29) డిగ్రీ వరకు చదువుకున్నారు. వివిధ యాప్‌లు, బ్యాంకుల ద్వారా సుమారు రూ. 9 లక్షల వరకు అప్పులు చేసి, ఏడాది కిందట హనుమకొండలో మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభించారు. మొదట్లో వ్యాపారం బాగానే సాగినా తరవాత నష్టాలు రావడంతో మానేశాడు. రెండు నెలల కిందట స్వగ్రామంలోనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ప్రారంభించారు. వ్యాపారం అంతంత మాత్రంగా ఉండటం, అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఇటీవల యాప్ నిర్వాహకులు అప్పు చెల్లించాలని వేధిస్తుండటంతో ఈ నెల 28న రాత్రి ములుకనూర్ రైతు వేదిక వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. యువకుడి తల్లి వినోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే : 'బలహీన వర్గాల రిజర్వేషన్లపై కోర్టు తీర్పు ఉంది.. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం తప్పకుండా కులగణన చేపడుతుంది.. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని' రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లింగాలఘనపురంలో కేజీకేఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, జిల్లా పాలనాధికారి రిజ్వాన్‌బాషా షేక్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ కులగణనపై నిన్నమొన్న కూడా చర్చలు జరిగాయన్నారు. గతంలో మాదిరి బలహీన వర్గాలకు అన్యాయం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పారు. జనగామ జిల్లాకు పేరు మార్పు నిర్ణయం ముఖ్యమంత్రి ఇప్పటికే చేశారన్నారు. శాసనసభ్యులం ముఖ్యమంత్రిని కలిసి జీవో వచ్చేలా చూస్తామన్నారు. దసరా పండగ లోపు గీత కార్మికుల బీమా బకాయిలు చెల్లించే బాధ్యత తీసుకుంటున్నానని చెప్పారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు కట్టుబడి ఉందన్నారు.

జనగామ జిల్లా లింగాలఘనపురంలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్

చెక్‌డ్యామ్‌కు కోత.. మరమ్మతులు సాగదీత!

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట, ఇల్లంద గ్రామాల మధ్య ఆకేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్ గతేడాది వచ్చిన వరదలకు కోతకు గురైంది. అప్పటి నుంచి మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైనుంచి వచ్చిన వరద వల్ల కోతకు గురైన ప్రాంతం మరింత పెరిగింది. దీంతో చెక్‌డ్యామ్‌లో చుక్కనీరు నిల్వ ఉండటం లేదు. కొన్నినెలల క్రితం చెక్‌డ్యామ్ మరమ్మతులు చేయడానికి రూ.30 లక్షల నిధుల కోసం నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులు చెక్‌డ్యామ్‌ను పరిశీలించి ప్రతిపాదనల్లో పనులకు సవరణలు సూచించారు. తాగునీటితో పాటు సాగుకు ఉపయోగపడే నీరు వృథా పోతుండటంతో రైతులు, పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానికుల డిమాండ్ మేరకు జడ్పీటీసీ మాజీ సభ్యుడు సారంగపాణి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు ముందుకువచ్చారు. ఈ పనులను ఇటీవల ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరిశీలించారు. కానీ! పనులు నెమ్మదిగా జరుగుతుండటంతో నీటి వృథా కొనసాగుతోంది.

కోతకు గురైన ప్రాంతం నుంచి దిగువకు వృథాగా పోతున్న నీరు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	115
రిటైల్:	137
డ్రెస్డ్:	199
స్కిన్‌లెస్:	226

ఈ మార్గం.. దుర్గంధభరితం

పున్నేలు, పంథిని శివారులో వరంగల్- ఖమ్మం ప్రధాన జాతీయ రహదారి పక్కన ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను వదిలివెళ్తున్నారు. కొందరు హోటళ్ల నిర్వాహకులు, తోపుడు బండ్లపై టిఫిన్ అమ్ముతున్న చిరు వ్యాపారులు మిగిలిన ఆహార పదార్థాలను, మాంసం వ్యాపారులు వ్యర్థాలను ఇక్కడే పారబోస్తున్నారు. వాటి నుంచి దుర్గంధం వస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, ఐనవోలు (హనుమకొండ)

నాలుగో లైను.. పనులు పరుగులు

ఒకప్పుడు రైలు పట్టాలు వేయాలంటే కార్మికులు నెలల తరపడి శ్రమించేవారు. ఇప్పుడు ఆధునిక యంత్రాలు రావడంతో పనులు పరుగులు పెడుతున్నాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి రోడ్డు నుంచి కాజీపేట ఎఫ్ క్యాబిన్ వరకు వేస్తున్న నాలుగో లైన్ పనులు చకచకా సాగుతున్నాయి. స్లీపర్లపై ముందుగానే పట్టాలు బిగించి, అత్యాధునిక క్రెయిన్-228ల సాయంతో తీసుకొచ్చి నిర్దేశిత స్థలంలో అమర్చుతున్నారు. ఎఫ్ క్యాబిన్ వద్ద ఆదివారం తీసిన చిత్రమిది.

– న్యూస్‌టుడే, కాజీపేట

దేవీ పూజకు వేళాయె..

వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి ముగిసి, దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు రంగం సిద్ధమవుతోంది. దుర్గా అమ్మవారి విగ్రహాలు పూజకు సిద్ధమయ్యాయి. జనగామలో విగ్రహ తయారీదారులు ఆ ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. జనగామ పట్టణం, పరిసర గ్రామాల నుంచి 30 విగ్రహాలకు ఆర్డర్ లభించిందని, విగ్రహం ధర రూ.25వేల వరకు ఉంటుందని తయారీదారులు చెబుతున్నారు.

– జనగామ, న్యూస్‌టుడే

పచ్చదనం విరిసింది.. ప్రకృతి మురిసింది



కనుచూపు మేర వరి పైరు. గుట్టకు పచ్చని రంగేసినట్లు చెట్లు. నేల నుంచి నింగి వరకు పచ్చదనం. ఆ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. చూసేవారికి కనువిందు చేస్తోంది. ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలో విస్తరించిన ఇనుప రాతి గుట్టల ప్రకృతి రమణీయత ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో తీసిన సుందర చిత్రమిది.

– ఈనాడు, హనుమకొండ

(c) eenadu

కార్మిక వ్యతిరేక విధానాలు వద్దు

మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్

ములుగు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఆదివారం ములుగులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా పని చేస్తూ అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిందని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, నాయకులు జక్కుల ఐలయ్య, శ్యాం సుందర్, సారయ్య, రాజేందర్, రమ, శోభ తదితరులు పాల్గొన్నారు.

11న అమరుల యాది సభ

అభివాదం చేస్తున్న పూర్వ పీడీఎస్‌యూ నాయకులు

ములుగు, న్యూస్‌టుడే: అమరులైన పీడీఎస్‌యూ విద్యార్థులను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని పీడీఎస్‌యూ పూర్వ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి అన్నారు. ఆదివారం ములుగులో జరిగిన పూర్వ పీడీఎస్‌యూ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి పరివాహక ప్రాంతమైన ములుగు ఏరియాలో ఎంతో మంది సంఘ విద్యార్థులు అమరులయ్యారని పేర్కొన్నారు. నవంబర్ 11న ములుగులో అమరుల యాది సభ నిర్వహించాలని తీర్మానించారు. విద్యార్థి అమర వీరుల ఆశయాలకు ఆశయ సాధనకు అనుగుణంగా పని చేస్తామని జంపాల జార్జిరెడ్డి, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, మధుసుదన్‌రాజ్, మారోజు వీరన్న తదితరులు స్పష్టం చేశారు. పూర్వ పీడీఎస్‌యూ ప్రతినిధులు రమేష్, రాజేందర్, రవి, ఓదేలు, మహేందర్, రమ, స్వరూప, దేవక్క తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

ప్రేమ్‌సాగర్

కొత్తగూడ, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవం రోజున.. ఇరవై ఏళ్లు కూడా నిండని యువకుడు.. అప్పటివరకు స్నేహితులతో కబుర్లు చెబుతూ.. ఒక్కసారిగా గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈ విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కార్లాయిలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పొడుగు నర్సయ్య, మల్లికాంబ దంపతుల చిన్న కుమారుడు పొడుగు ప్రేమ్‌సాగర్(20) ఇంటర్మీడియట్ మధ్యలోనే ఆపేసి ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆదివారం స్నేహితులందరు కలిసి గ్రామంలోని ఓ కిరాణ దుకాణం వద్ద శీతలపానీయం తాగుతున్నారు. అనంతరం ఒక్కసారిగా ఛాతినొప్పి వస్తుందంటూ ప్రేమ్‌సాగర్ కుప్పకూలినట్లు పేర్కొన్నారు. స్నేహితుందరు కలిసి ద్విచక్రవాహనంపై కొత్తగూడకు తీసుకొచ్చారు. వైద్యుల సూచన మేరకు నర్సంపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఇంతా చిన్న వయసులో యువకుడు గుండెపోటుకు గురై మృతిచెందడం గ్రామంలో విషాదం నింపింది.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం జంగాలపల్లిలోని అంగడిలో చేతి పంపు పని చేయడం లేదు. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- గుండెమీది వెంకటేశ్వర్లు, రాయినిగూడెం

పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

- తిరుపతి, పంచాయతీ కార్యదర్శి

రోడ్లపై పశువుల తరలింపు

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం పట్టణంలో రోడ్లపై తిష్ఠ వేసిన పశువులను పంచాయతీ అధికారులు తరలించారు. వాహనదారులను తిప్పలు పెడుతున్న విషయాన్ని 'మేమున్నాం మీకుతోడుగా' లో వచ్చిన సమస్యను కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ స్పందిచంఅరు. సిబ్బందితో ఆయా రోడ్లపై ఉన్న మూగజీవాలను బందెలదొడ్డికి చేర్చారు.

స్పందనకు వందనం

లీకేజీకి అడ్డుకట్ట

తాడ్వాయి: మండలంలోని నార్లాపురం గ్రామంలో తాగునీటి పైపులైనుకు రంధ్రం ఏర్పడటంతో.. లీకేజీ కారణంగా తాగునీరు సరఫరా సరిగా జరగడం లేదని స్థానికులు నూనావత్ శ్రీను 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్‌కు వివరించగా, ఆయన స్పందించి పంచాయతీ సిబ్బందిని పురమాయించి పైపులైనుకు మరమ్మతులు చేయించారు.

రహదారికి మరమ్మతులు

తాడ్వాయి: మండలంలోని బందాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారి కోతకు గురికావడంతో.. రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గ్రామానికి చెందిన ఆగబోయిన రామయ్య సమస్యను 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు వివరించగా, ఆయన వెంటనే స్పందించి పంచాయతీ ట్రాక్టరు, కూలీల సాయంతో రహదారికి మరమ్మతులు చేయించారు.

3 నుంచి శ్రీఉమాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

మంగపేట, న్యూస్‌టుడే: స్థానిక శ్రీ ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో శ్రీ ఉమాదేవి శరన్నవరాత్రి(దసరా) మహోత్సవాలు వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కోలగట్ల నరేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. 3న అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణ, 4న గాయత్రిదేవి, 5న అన్నపూర్ణాదేవి 6న మహాచండీ దేవి , 7న లలితాదేవి, 8న మహాలక్ష్మీదేవి 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని అవతారాల్లో దర్శనమిస్తారని తెలిపారు. 12న విజయదశమి సందర్భంగా ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం జమ్మిచెట్టు పూజ ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

గీత కార్మికులకు పింఛను ఇవ్వాలి

పస్రా తాటి వనంలో సమావేశమైన కేజీకేఎస్ జిల్లా నాయకులు

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: యాభై ఏళ్లు నిండిన ప్రతి గీత కార్మికుడికి ప్రభుత్వం వృత్తి పింఛను ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. పస్రా సమీపంలోని తాటివనంలో ఆదివారం సంఘం నాయకుడు జక్కు రాజు అధ్యక్షతన గీత కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి గీత కార్మికునికి ప్రభుత్వం ద్విచక్ర వాహనాలను అందజేయాలన్నారు. గిరిజన, గిరిజనేతర అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సురక్షిత మోకులు అందజేయాలన్నారు. వృత్తి పింఛను నెలకు రూ. 5 వేలు చెల్లించాలన్నారు. జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జీఓ నెంబరు 560 ప్రకారం తాటి చెట్ల పెంపకానికి ప్రభుత్వమే ఐదు ఎకరాలు స్థలాన్ని కేటాయించాలన్నారు. న్యాయమైన హక్కుల సాధన కోసం గీత కార్మికులు సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో సిద్ధం కావాలని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు జె. నర్సయ్య, బి.వేణు, బి.జగదీశ్వర్, జె.మొగిలి, ఎం.సుధాకర్, పి.నర్సయ్య, డి.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించరూ..

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ ఏటూరునాగారం డివిజన్ అధ్యక్షుడు కొర్స వంశీ డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. తాత్కాలికంగా రెండు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్న అధికారులు పక్కా భవనాల నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలన్నారు. కళాశాలకు వచ్చే విద్యార్థులకు సమయానికి అనుగుణంగా బస్సు సర్వీసులు నడపాలని కోరారు. మండల వ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, ఫర్నిచర్ సదుపాయం లేకపోవడంతో బావిపారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కిషోర్, సాయిరామ్, చందు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యానికి దిగడం సరికాదు

మంగపేట, న్యూస్‌టుడే: కమలాపురం బిల్టు కర్మాగార ప్రహరీని ఆనుకొని వీధి వ్యాపారాల దుకాణాల నుంచి బిల్టు కర్మాగారంలో పనిచేస్తున్న ఓ సంస్థ అక్రమంగా విద్యుత్తు వాడుకుంటోందని భారాస మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ సిబ్బందితో మూడు రోజుల క్రితం బిల్టు కర్మాగారంలోకి వెళ్లగా సదరు సంస్థ ఉద్యోగులు విద్యుత్తు సిబ్బందిపై దౌర్జన్యానికి దిగడం సరైన చర్య కాదన్నారు. దౌర్జన్యానికి దిగిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో భారాస మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మండల నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కోటాలో భర్తీ చేయాలి

వెంకటాపూర్, న్యూస్‌టుడే: రామప్ప అభివృద్ధి కోసం నిత్యం వార్తలు రాస్తూ ప్రభుత్వాన్ని, అధికారుల దృష్టికి పలు సమస్యలు తీసుకెళుతూ నిత్యం కృషి చేస్తున్న జర్నలిస్టులకు ఆ కోటాలో రామప్ప ఆలయ ఛైర్మన్ పదవి కేటాయించాలని ప్రభుత్వాన్ని, మంత్రి సీతక్కను రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి

గ్రామ దేవతకు పూజలు చేస్తున్న ఎస్సై తాజుద్దీన్

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని ఏటూరునాగారం ఎస్సై ఎస్కే.తాజుద్దీన్ సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ వీధిలో గల ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. అమ్మవారికి క్షీరాభిషేకం, నేతి అభిషేకం, దీపారాధన, శాంతి పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలు అందించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించారు. గ్రామంలో ఏవైనా సమస్యలున్నప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎస్సై ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి రేకులు, రంగులు విరాళంగా అందించి సహకరించినట్లు ఆలయ ఉత్సవ కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కె.రతన్‌కుమార్, రమేష్, శ్రావణ్, నాగేష్, దుర్గారావు, చిన్న, కన్నేశ్వర్‌రావు, రాజేశ్వరి, దేవి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థం.. దుర్గంధం

వెంకటాపురంలోని ప్రభుత్వ కార్యాలయాల కూడలి ప్రాంతం దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఇక్కడి అటవీ శాఖ డివిజన్ కార్యాలయం ప్రహరీ చెంతనే వ్యర్థాలు పడేస్తుండటంతో అపరిశుభ్రంగా మారింది. నిత్యం ఇదే మార్గంలో జీసీసీ ఉద్యోగులు, జడ్పీఎస్ పాఠశాల, ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ మార్గంలో వెళ్లేవారు ముక్కులు మూసుకొని వెళ్లాల్సివస్తోంది.

–న్యూస్‌టుడే, వెంకటాపురం

అటవీ డివిజన్ కార్యాలయం ప్రహరీ వద్ద ఇలా

వాహనాలు ఇలా.. అంబులెన్స్ వెళ్లేది ఎలా?

ఎంజీఎం ఆసుపత్రిలోని పిల్లల విభాగానికి వెళ్లే దారిలో.

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని పిల్లల విభాగం ముందు ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నవజాత శిశువులను తీసుకొచ్చే అంబులెన్స్‌లకు దారి లేకుండా పోతోంది. దీంతో రోడ్డుపై అంబులెన్సు నిలిపి, పిల్లలను వార్డులోకి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ విభాగంలోనే నెలలు నిండని, ఉమ్మనీరు మింగిన పిల్లలు, కామెర్లు ఇతర శ్వాసకోశ వ్యాధులు, పుట్టకతో అనారోగ్యంతో ఉన్న చిన్నారులకు చికిత్స అందించే నవజాత శిశువు సంరక్షణ కేంద్రం ఉంది. పిల్లల అత్యవసర విభాగం సైతం ఇక్కడే ఉంటుంది. ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి అత్యవసర బాధిత పిల్లలను ఇక్కడికి తీసుకువస్తుంటారు. అలాంటి అత్యవసర విభాగం ముందు ద్విచక్ర వాహనాల పార్కింగ్ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు తక్షణం స్పందించి, తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి

ఘనంగా కుమారస్వామి జయంతి వేడుకలు

గోవిందరావుపేట గ్రామంలో కేక్ కోస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటకృష్ణ. హాజరైన నాయకులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దివంగత నల్లెల కుమారస్వామి జయంతిని ఆదివారం గోవిందరావుపేటలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ మండలశాఖ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ హాజరై కేక్ కోశారు. కుమారస్వామి చేసిన సేవలను కొనియాడుతూ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జె.సోమయ్య, కె.నాగేందర్ రావు, పి.వెంకన్న, టి. హరి ప్రసాద్, పి.శ్రీకాంత్, జి.నాగలక్ష్మీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేటలో..

మంగపేట: పేద ప్రజలకు అండగా నిలిచి కష్ట సుఖాల్లో తోడున్న కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు దివంగత నల్లెల కుమారస్వామి సేవలు మరువలేనివని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్ఆర్ సెంటర్‌లో ఆదివారం నల్లెల కుమారస్వామి జయంతి సందర్భంగా కేకు కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాలి

తాడ్వాయిలో సమావేశమైన తుడుందెబ్బ నాయకులు

తాడ్వాయి, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం చేసిన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా ఉపాధ్యక్షుడు పాయం కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి ఆదివాసీ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న అధికారులనే నియమించాలని ఆయన కోరారు. ఆదివాసీ విద్యార్థిసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నిబెల్లి గణేష్, మండల అధ్యక్షుడు మోకాళ్ల వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం

శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

ములుగు, న్యూస్‌టుడే: జంపన్న ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ములుగులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి చెందిన డాక్టర్ ప్రణయ్ వైద్య బృందం సుమారు 325 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 70 మందికి శస్త్ర చికిత్సలు అవసరం అని నిర్ధారించి ప్రత్యేక వాహనం ద్వారా హైదరాబాద్ తరలించారు. బీపీ, సుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు జంపన్న, ప్రతినిధులు గుండారపు రాజు, అన్నారపు నాగార్జున, బాదావత్ రాజ్‌కుమార్, కొడపాక మహేందర్, నాజర్, విక్రమ్, శ్రీనివాస్, సాగర్, నేరెళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా కుటుంబంలో చేరండి

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బలరాం తదితరులు

ములుగు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ భాజపా కుటుంబంలో చేరాలని భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ఆదివారం పత్తిపల్లి గ్రామంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా భాజపా కుటుంబంలో చేరాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవీంద్రాచారి, నాయకులు భూక్యా రాజు. అడప భిక్షపతి, గంగిశెట్టి రాజ్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

గుడుంబా, ద్విచక్రవాహనంతో ఎస్సై హరీశ్, సిబ్బంది

వాజేడు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తాళ్లగూడెం నుంచి ప్రభుత్వ నిషేధిత గుడుంబాను తరలిస్తున్న ఇద్దరిపై వాజేడు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వాజేడు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోయవీరాపురం అడ్డరోడ్డు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని పట్టుకుని వాహనంపై ఉన్న బస్తాను తనిఖీ చేయగా రూ.48వేల విలువైన 120 లీటర్ల గుడుంబా గుర్తించారు. గుడుంబాను వాహనాన్ని సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రామప్పలో సండే సందడి

పూజలు నిర్వహిస్తున్న వరంగల్ జైలు సూపరింటెండెంట్ కళాసాగర్

వెంకటాపూర్, న్యూస్‌టుడే: ములుగు జిల్లా రామప్పలో ఆదివారం భక్తులు సందడి చేశారు. వారాంతపు సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం బారులు తీరారు. దర్శనం అనంతరం రామప్ప గార్డెన్‌లో కుటుంబ సమేతంగా, తోటి స్నేహితులతో కలిసి ఆటాపాటలతో ఆనందంగా గడిపారు. వరంగల్ జైలు సూపరింటెండెంట్ కళా సాగర్, అమెరికా దేశానికి చెందిన డేవిడ్ తదితరులు సందర్శించిన వారిలో ఉన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008001791
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008014568

ప్రతి ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన అవసరం

మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.కాళీ ప్రసాదరావు. చిత్రంలో డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: శ్వాస, హృదయ స్పందన ఆగిపోయినప్పుడు అత్యవసరంగా ప్రాణాలను రక్షించే ఛాతీ మర్దన ప్రక్రియ(సీపీఆర్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలోని ఎన్ఆర్ఐ భవన్‌లో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీపీఆర్‌పై కమ్యూనిటీ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

☛ అనంతరం మరో అతిథి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.కాళీ ప్రసాదరావు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సీపీఆర్‌పై అన్నివర్గాల ప్రజలకు అవగాహన కల్పించిన శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ డా.రామాక శ్రీనివాస్‌ను అభినందించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7గంటల వరకు సీపీఆర్, డిఫిబ్రిలేటర్(షాకింగ్)లపై వాకర్స్, పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, నర్సింగ్ విద్యార్థులు, పోలీసు, సాధారణ ప్రజలకు అవగాహన కల్పించారు. సమర్థంగా సీపీఆర్ నిర్వహించిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.కాజీపేట వెంకటరమణ, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.అన్వర్‌మియా, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వరంగల్ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డా.వడ్డె రవీందర్, ప్రాంతీయ సమన్వయకర్త కిషన్, కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సదానందం, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు.

ఏటూరునాగారంలో 36 సీసీ కెమెరాలు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: అసాంఘిక శక్తులు, దొంగల బెడద నుంచి ప్రజలను కాపాడాలనే లక్ష్యంతో ఏటూరునాగారం పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో 36 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎస్కే.తాజుద్దీన్ తెలిపారు. మారుమూల గ్రామాల్లోనూ మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నేరాలను నియంత్రించడం, నిందితులను గుర్తించడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో సైతం ఏర్పాటు చేసి అనునిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

ఉమ్మడి జిల్లా స్థాయి కుస్తీ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో చేపట్టిన ఉమ్మడి జిల్లా స్థాయి కుస్తీ(రెజ్లింగ్) ఎంపిక పోటీలు ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. అండర్-14, 17 విభాగంలో జరిగిన పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన 120 బాలబాలికలు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దస్రునాయక్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి మహ్మద్ కరీం, డీఎస్ఏ కోచ్ రాజు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రవీందర్, జ్యోతి, ముఖర్జీ, లావణ్య, సుజాత పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం నగర శివారులోని మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో వరంగల్, మెదక్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 49.2 ఓవర్లలో 219 పరుగులు చేసింది. జట్టులో విశేష్ 31 పరుగులు(3 వికెట్లు), రిష్యాంత్ 31 పరుగులు(3 వికెట్లు) తీశారు. ఛేదనకు దిగిన మెదక్ జట్టు 29.4 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌట్ అయ్యింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, నల్గొండ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రఫే 71 పరుగులతో రాణించాడు. ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 32 ఓవర్లలో 98 పరుగులకే ఆలౌట్ అయ్యింది. పూల్ 'ఏ'లో లీగ్ పోటీల్లో మహబూబ్‌నగర్ ముందంజలో ఉందని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

☛ నేటి మ్యాచ్‌లు: కోమటిపల్లి మైదానంలో వరంగల్_ నల్గొండ జట్లు, మొగిలిచర్లలో మహబూబ్‌నగర్_ మెదక్ జట్ల మ్యాచ్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలం యోగితానగర్ వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన నాగుల చందర్‌రావు(41) మృతి చెందారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చందర్‌రావు రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఛాతీపై తీవ్రగాయాలు కావడంతో చనిపోయారు. గ్రామస్థులు ఆపత్కాల వాహనం 108కి సమాచారం అందించారు. పైలట్ రాధాస్వామి, ఈఎంటీ ప్రవీణ్‌లు క్షతగాత్రుడిని హుటాహుటిన వెంకటాపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేర్చారు. అప్పటికే శివాజీ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

(c) eenadu